క్లుప్తంగా

రేపు మండల సమావేశం

గంగవరం: గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి వచ్చే సమస్యల పరిష్కారం కోసం అధికారులతో చర్చిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

గాయత్రీదేవిగా బాటగంగమ్మ



బైరెడ్డిపల్లి: బాటగంగమ్మ ఆలయ మండప పూజల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

కుప్పం: మహా శివరాత్రి ఉత్సవాలకు శనివారం నుంచి వివిధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ కుప్పం డిపో మేనేజర్ స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ భరత్ సూచన మేరకు ప్రత్యేక సర్వీసులు నడుపనున్నట్లు పేర్కొన్నారు. కుప్పం నుంచి మల్లప్పకొండకు 15 బస్సులు, కంగుందికొండకు 2, శ్రీకాళహస్తికి ఒక బస్సు నడుపనున్నట్లు తెలిపారు.

రేపు వాలీబాల్ టోర్నీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేటలో ఈనెల 19వ తేదీ శివరాత్రి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళంపేట సంతగేటులో నిర్వహించే ఈపోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ. 15,116, రెండవ బహుమతిగా రూ. 8,116 ప్రదానం చేస్తామన్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 95028 39208 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చౌడేపల్లె: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కాగతి పంచాయతీ యనమసామనపల్లెకు చెందిన ఎన్.నాగరాజును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. రహస్య సమాచారం మేరకు సిబ్బందితో సహా కలిసి దాడి చేయగా 25 మద్యం పాకెట్లు లభించాయన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండుకు ఆదేశించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

సోమల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని భారతంమిట్టకు చెందిన బత్తల శ్రీరాములు(65) శుక్రవారం మృతి చెందాడు. బుధవారం కాలినడకన స్వ గ్రామానికి వెళుతుండగా వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీరాములు తిరుపతి రుయా లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురు వారం శ్రీరాములును చూసేందుకు వెళ్లిన అత్త లక్ష్మమ్మ కుప్పకూలి మృతి చెందిన విషయం తెలిసిందే.

దర్జాగా కబ్జా!



అక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

రొంపిచెర్ల : మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న జాతీయ రహదారి పక్కన రూ.2కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని కొందరు రియల్టర్లు దర్జాగా కబ్జా చేశారు. వివరాలు.. రొంపిచెర్ల క్రాస్ వద్ద ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల పక్కన సర్వే నంబర్ 895లో 2.89 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీని పక్కనే ఉన్న భూమిని పీలేరుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. అనంతరం సర్కారు స్థలంపై కన్నేశారు. సమీపంలో నేషనల్ హైవే పనులు సాగుతుండడంతో ఎకరా రూ.కోటికి వరకు పలుకుతోంది. దీంతో రాత్రిరాత్రే భూమిని చదును చేసి ఆక్రమించుకున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పురాతన శివాలయాలకు మహర్దశ

- పర్యాటక కేంద్రాలుగా మారనున్న అగస్తీశ్వర, మునీశ్వరస్వామి దుర్గం ఆలయాలు
- మంత్రి పెద్దిరెడ్డి చొరవతో రూ.కోట్లతో అభివృద్ధి
- నేటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక బస్సులు నడుపనున్న ఆర్టీసీ



నెక్కుంది కొండపై ఆధునీకీకరించిన అగస్తీశ్వరస్వామి ఆలయం



నెక్కుంది నుంచి కొండపైకి వేసిన తారు రోడ్డు



నెక్కుంది కొండపై ప్రారంభానికి సిద్ధమవుతున్న పుష్కరిణి

పుంగనూరు/సోమల: దక్షిణ కాశీ క్షేత్రంగా విరాజిల్లుతున్న మండలంలోని అతిపురాతన శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయానికి, సోమల మండలం దుర్గం కొండలో వెలసిన శ్రీగార్గేయ మునీశ్వరస్వామి ఆలయాలకు మహర్దశ పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రూ.కోట్లు ప్రభుత్వ, సొంత నిధులు ఖర్చు చేసి ఆలయాల రూపురేఖలు మార్చివేశారు. పర్యాటక క్షేత్రాలుగా ఈ శివాలయాలను రూపుదిద్దేందుకు మంత్రి పెద్దిరెడ్డి బృహత్తర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నెక్కుంది ఆలయ చరిత్ర ఇది


పుంగనూరు మండలంలోని నెక్కుంది కొండలపై శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయాన్ని చోళులు 1329లో నిర్మించారు. ఈ ఆలయ అభివృద్ధికి పుంగనూరు జమిందార్లు భూములు విరాళంగా ఇచ్చారు. ఆలయంలో అగస్తీశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, వినాయకుడు, చౌడేశ్వరి, పార్వతి, భద్రకాళి అమ్మవార్లు వెలసియున్నారు. ప్రదక్షిణ మండపం స్తంభాలు చక్కటి శిల్పకళతో ఇట్టే ఆకట్టుకుంటాయి. తమిళ, తెలుగు శాసనాలు అనేకం ఉన్నాయి. మొదటి శాసనం క్రీ.శ 1192 –1193 నాటి మొదటి కులోత్తుంగ వీరరాజేంద్రుడిది. తరువాత క్రీ.శ 1329లో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన గంగవంశ రాజై (ఉత్తమచోళ గంగపుడమి దేవకుమారుడు) సెల్వగంగరాజు, అతని పట్టపుమహిషి సెల్వగంగ విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు శాసనంలో లిఖించి ఉన్నారు. ఇక్కడ ఈశ్వరుడు ప్రధాన దైవం, అగస్త మహాముని పూజించిన శివలింగాన్ని ఇక్కడ రాజులు తెచ్చి ప్రతిష్ఠించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. అందుకే ఈ ఆలయానికి అగస్తీశ్వరాలయమని పేరు వచ్చింది.

అభివృద్ధి కార్యక్రమాలు..

కొండకు మూడు వృత్తాకారపు కోటలున్నాయి. ఇది ఒకప్పుడు గిరి దుర్గంగా ఉండేది. రెండు కొండలకు మధ్య భాగంలో కోనేరును సుమారు రూ.3 కోట్లతో అత్యంత సుందరంగా నిర్మిస్తున్నారు. ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. పర్యాటకులు సేద తీరేందుకు రూ.2 కోట్లతో విశ్రాంతి గదులు నిర్మిస్తున్నారు. సుమారు రూ.5 కోట్లతో మూడు కిలోమీటర్లు కొండకు తారురోడ్డు వేసి, 72 విద్యుత్ స్తంభాలు నాటి, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. అలాగే స్వామివారి రథం తిరిగే ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మించారు. వాహనాలకు పార్కింగ్ స్థలాలు, వ్యాపార స్థలాలు కేటాయించి, పర్యాటక కేంద్రంగా మార్చే కార్యక్రమాన్ని మంత్రి పెద్దిరెడ్డి స్వయంగా చేపట్టారు. కాగా 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మంత్రి పాల్గొని పూజలు నిర్వహించనున్నారు. భక్తుల కోసం కొండకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

అతిపురాతన దుర్గంకొండ

సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె సమీప దుర్గం కొండ గెవిలో వెలసిన గార్గేయ మునీశ్వరాలయం అత్యంత పురాతనమైంది. సుమారు వెయ్యిఏళ్ల కిందట గార్గేయముని దుర్గంకొండల్లో కఠోర తపస్సు నిర్వహించినట్లు చరిత్ర పేర్కొంటోంది. సోమల నుంచి 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న దుర్గంకొండకు చేరుకుని అక్కడి నుంచి భక్తులు ఏడు కిలో మీటర్లు కొండకు కాలినడకన వెళ్లేవారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెద్ద ఉప్పరపల్లె నుంచి బోనమంద మీదగా దుర్గం కొండకు దాదాపు 9 కిలోమిటర్ల మేర రూ.6.5 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. బోనమంద నుంచి ఆలయం వద్దకు విద్యుదీకరణను పూర్తిచేయించారు. భక్తుల సౌకర్యార్థం రూ.2.5 కోట్లతో విశ్రాంతి భవనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పుంగనూరు డిపో నుంచి శివరాత్రి ఉత్సవాలకు 10 ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయించారు. మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.





నిర్మించిన తారురోడ్డు, పనులను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి(ఫైల్)

నేడు మంత్రి పెద్దిరెడ్డి రాక

దుర్గంకొండలోని శ్రీగార్గేయ మునీశ్వరస్వామి ఆలయ శివరాత్రి ఉత్సవాల్లో శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

50 పడకల ఆస్పత్రిగా మారుస్తూ జీఓ



సదుం: చురుగ్గా సాగుతున్న ట్యాంకు నిర్మాణ పనులు

సదుం: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆస్పత్రి స్థాయిని 50కి పెంచుతూ జీఓ జారీ అయినట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప శుక్రవారం తెలిపారు. అలాగే తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి చొరవతో ఇటీవలే మండలానికి వంద ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు అయ్యాయని, వాటి పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు.

ఆభరణాల దొంగ అరెస్టు

సోమల: మద్యం తాగించి ఆభరణాలను చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి తెలిపారు. ఆయన కథనం మేరకు ..మండలంలోని వల్లిగట్ల పంచాయతీకి చెందిన హరణ్‌కుమార్‌కు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగించారు. అతని వద్ద ఉన్న బంగారు చైన్, ఉంగరం, సెల్ ఫోను చోరీ చేసి పారిపోయారు. ఈనెల 6వ తేదీన చోరీపై బాధితుడు ఫిర్యాదు చేశారు. సూరయ్యగా రిపల్లె బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని శుక్రవారం అదుపులోకి తీసుకెళ్లి విచారించారు. విచారణలో రామచంద్రాపురానికి చెందిన అన్నముల్లై, మైనర్ బాలుడుగా తేలింది. బంగారు నగలు లాక్కొని వెళ్లింది తామేనని వారు అంగీకరించారు. ఆభరణాలను స్వాధీనం చేసుకుని, మైనర్‌ను అతని తండ్రికి అప్పగించి, అన్నముల్లైను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

బాబు వైఫల్యాలను ఇంటింటా వివరించాలి

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎంపీ రెడ్డెప్ప పిలుపు
- కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్సీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, పక్కన ఎమ్మెల్సీ భరత్

కుప్పం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి భరత్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఎంపీ రెడ్డెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లు, గుడుపల్లె మండల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నుంచి గెలుస్తున్నా 35 ఏళ్లగా ఎలాంటి అభివృద్ధిని పట్టించుకోని చంద్రబాబు వైఫల్యాలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని తెలిపారు. గెలిచినా తరువాత హైదరాబాద్‌లో కూర్చునే చంద్రబాబు కంటే అందరికీ అందుబాటులో ఉంటూ కుప్పంలోనే నివసించే భరత్‌ను గెలిపించుకోవాలని పేర్కొన్నారు. 'బాబును ఓడిద్దాం...భరత్‌ను గెలిపిద్దాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని వెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కుప్పంలో ఎంపీ క్యాంప్ కార్యాలయం కూడా ప్రారంభించామని, అందరికీ అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. భరత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలపడిందని, క్షేత్ర స్థాయిలో వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎంపీపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు అధికంగా వైఎస్సార్ సీపీ మద్దతు దారులే ఉన్నారని, అందరూ కలసి కట్టుగా పనిచేస్తే కుప్పం నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని పేర్కొన్నారు.

23 నుంచి వార్డు బాట

కుప్పం మున్సిపాలిటీలో ఈ నెల 23 నుంచి వార్డు బాట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్, రెస్కో చైర్మన్, ఏఎంసీ చైర్మన్‌లు బృందంగా వార్డు బాటలో పాల్గొననున్నట్లు వివరించారు. పార్టీ నియోజకవర్గ రాజకీయ పరిశీలకుడు మొగశాల రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, ఎంపీపీలు అశ్విని, వరలక్ష్మి, జెడ్పీటీసీ శరవణ, కృష్ణమూర్తి, మండల కన్వీనర్లు మురుగేష్, రామకృష్ణ తదితరులు పాల్గొగన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రామకుప్పం: ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని లబ్ధిదారులకు క్షేత్ర స్థాయిలో వివరించి, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ గెలుపునకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని ఆకందగానిపల్లెలో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా సంక్షేమ లబ్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే అందిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణప్ప గౌడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాబు హామీలను ప్రజలు నమ్మడం లేదు



బైరెడ్డిపల్లె: మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్కసుతో రాజకీయాల్లో కాలం చెల్లిన చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను ప్రజలెవ్వరూ నమ్మడం లేదని ఎంపీ ఎన్.రెడ్డెప్ప అన్నారు. బైరెడ్డిపల్లెలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 సంవత్సరాల చంద్రబాబు కాలంలో కరువును మాత్రమే చూశామన్నారు. వర్షాలు లేక పోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని చంద్రబాబు నాయుడు ప్రజలను మోసపూరిత మాటలతో నమ్మిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. అనుకూల పత్రికల్లో వార్తలు రాసుకోవడం తప్ప ప్రజలకు మేలు చేయాలని చంద్రబాబుకు లేదన్నారు. కేవలం ఎన్నికల కోసమే హామీలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలు ఉన్నారన్నారు. చంద్రబాబు పాలనలో పింఛన్లు తీసుకోవాలంటే వృద్ధులు ఎలాంటి అగచాట్లు పడ్డారో అందరికీ తెలుసన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి పేద వర్గాలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. నేడు ప్రమాదాలు జరిగిన వెంటనే 108 ప్రత్యక్షమవుతుందని, అప్పట్లో 108 వాహనానికి డీజిల్ లేక, తుప్పుపట్టిన వాహనాలు అక్కడక్కడా కనిపించేవన్నారు. పాదయాత్రలో లోకేష్ తాము ఏమి అభివృద్ధి చేస్తామో చెప్పకుండా రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తూ కామెడీ షో చేస్తున్నారని విమర్శించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అధ్యక్షుడు కార్తీక్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం



పూజల్లో పాల్గొన్న భక్తులు

గుడుపల్లె: మల్లప్పకొండపై వెలసిన శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణోత్సవం శుక్రవారం కనులపండువగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం కల్యాణోత్సవం ప్రారంభమైంది. శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి వేదిపై కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అశేష సంఖ్యలో విచ్చేసిన భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ పరిసరాలు ఓం నమశ్శివాయ నామస్మరణతో మార్మోగింది.

నేడు మహా శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అశేషంగా విచ్చేయనున్న భక్తుల కోసం ప్రత్యేక క్యూలు, భోజన వసతులు, నీడ, నీరు సౌకర్యం కల్పించారు. కుప్పం నుంచి గుడుపల్లె మీదుగా మల్లప్పకొండకు గంటగంటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆలయ నిర్వాహకులుతెలిపారు.

సర్కార్ కళాశాలలో సకల సౌకర్యాలు

- డిగ్రీ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఓపెన్‌డే
- ఇక్కడే చేరుతామని పలువురు ఆనందంగా వెల్లడి



డిగ్రీ కళాశాలలోని సౌకర్యాలను వివరిస్తున్న ప్రిన్సిపల్ వెంకటేశులు

పలమనేరు: పలమనేరు శ్రీవజ్రచెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సౌకర్యాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యాధునిక ల్యాబ్‌లు, సువిశాలమైన మైదానం, ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందుతోందని ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఓపెన్‌డే అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. పలమనేరు ప్రాంతంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. వీరికి కళాశాలలోని సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన తరగతి గదులు, క్రీడల కోసం పెద్ద మైదానం, పక్కనే ఇండోర్ స్టేడియం, పచ్చని చెట్లను చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న సేవలను నేరుగా చూపెట్టాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. తద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను పెంచడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రైవేటు కళాశాలలో భారీ ఫీజులు కట్టేపని లేకుండా ప్రభుత్వం ద్వారా ఉచితంగా చదువుకోవచ్చని సూచించారు. ఇక్కడ అనుభవం కలిగిన అధ్యాపకులున్నారని వివరించారు. దీంతో పలువురు విద్యార్థులు తాము ఇక్కడే అడ్మిషన్ తీసుకుంటామని ఆనందంగా తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం, షణ్ముగం, అధ్యాపకులు శ్రీదేవి, చిదంబరం, కళాశాల సలహా కమిటీ సభ్యులు గంగిరెడ్డి, సీతారామయ్య, పలు ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

రొంపిచెర్ల: వరి పంటలో కాండం తొలుచు పురుగులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. శుక్రవారం బోడిపాటివారిపల్లెలో వరి సాగుపై అవగాహన కల్పించారు. ఈ పురుగుల నివారణకు లింగా కర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలి పారు. నీలి, పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేస్తే పురుగులు అతుక్కుని మృతి చెందుతాయని తెలిపారు.

బోయకొండ గంగమ్మా.. పాహిమాం



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజాము ఆలయాన్ని శుద్ధి చేశారు. మామిడి, వేపాకుల తోరణాలు కట్టారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10–30 గంటల నుంచి 12 వరకు రాహుకాల సమయంలో వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబు



ముస్తాబైన కల్లూరు చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం

పుంగనూరు: మహాశివరాత్రికి మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని నెక్కుందిలో వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి ఈనెల 22 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సారె సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయం, శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయం, భీమగానిపల్లెలోని భీమేశ్వరాలయం, పుదిపట్ల సమీపంలోని పంచలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ప్రత్యేక అభిషేక పూజలు జరుగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలను ఏర్పాటు చేశారు. గ్రూప్ ఆలయాల ఈవో కమలాకర్, జూనియర్ అసిస్టెంట్ వెంకట్రమణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాలకు వెల్లవేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శుక్రవారం రాత్రి నుంచి శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. చలువపందిళ్లు వేశారు.

విస్తృత ఏర్పాట్లు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయంలోని నాగమల్లేశ్వరస్వామి ఆలయం, కన్నెముల వినాయకస్వామి ఆలయం, నడిగడ్డ మల్లేశ్వరస్వామి, జంగంపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి, సదుంలోని మరకతలింగేశ్వర స్వామి, కొత్తపల్లె శ్రీవారిపాదక్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఊటుపల్లె దేవలంబోడులో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. జాగరణ మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం, జాండ్ర పేటలోని మల్లీశ్వరస్వామి ఆలయం, కొమ్మిరెడ్డిగారిపల్లెలోని మల్లికార్జున స్వామి ఆలయాల్లో మహా శివరాత్రికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయా నిర్వాహకులు తెలిపారు. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించి, చలువపందిళ్లు వేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండల కేంద్రంలోని బజారువీధిలో వెలసిన శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, యర్రప్పల్లెలోని బసవేశ్వరస్వామి ఆలయం, పుదిపట్లలోని పంచలింగేశ్వరస్వామి ఆలయాలు మహా శివరాత్రి సందర్భంగా సుందరంగా ముస్తాబయ్యాయి. వేకువజామునే అభిషేక పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాటు చేశారు.

కాలభైరవస్వామి ఆలయంలో

గంగవరం: మండలంలోని పత్తికొండపై వెలసిన శ్రీకాలభైరవస్వామివారి శివారాత్రి ఉత్సవాలు శనివారం నుంచి మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించనున్నారు. చోళరాజుల కాలం నుంచి అత్యంత మహిమాన్వితంగా పేరు గాంచిన ఈ ఆలయంలో ఏటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.